
ఓటరు నాడి దొరకట్లే ...!

- ఇప్పటికే రూ.కోట్లల్లో ఖర్చు చేసిన పార్టీలు.
- ఎవరిని అడిగినా మా ఓటు మీకే అంటున్న ఓటరు



సాక్షి, మేడ్చల్ జిల్లా: పోలింగ్‌కు మరో ఒక రోజు మాత్రమే ఉండటంతో నగరంతోసహా శివారులోని నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాల్లో పార్టీలన్నీ క్షేత్రస్థాయి ప్రచారం, ఇతరత్రా నిర్వహణ ఖర్చులకు నిత్యం రూ.కోట్లు ఖర్చుపెడుతున్నాయి. అయినా ఓటరు నాడి మాత్రం చిక్కడం లేదని ప్రధాన పార్టీల నాయకులు పేర్కొంటున్నారు. గతంలో పలు దఫాల్లో జరిగిన ఎన్నికల్లో పోల్ మేనేజ్‌మెంట్ చేసిన నాయకులు కూడా ఇలాంటి పరిస్థితిని ఎన్నడూ చూడలేదని వెల్లడిస్తుండటం ప్రస్తుత పరిస్థితికి అద్దం పడుతోంది. గతంలో ఉన్నట్లుగా నేతలు చెబితే పార్టీ కార్యకర్తలు ఓటేసే పరిస్థితులు క్షేత్రస్థాయిలో లేకపోవడంతో పోటీ చేసే అభ్యర్థులు చాలా చోట్ల తమ రెండో శ్రేణి నాయకులను కాకుండా నేరుగా ఓటర్లనే నమ్ముకుంటున్నారు. గతంలో డబ్బులు ఇచ్చిన ఓటర్లు తమకే ఓటు వేస్తామని ప్రమాణాలు చేసేవారని... ఇప్పుడు ఎంత ఖర్చు పెట్టినా ఎవరికి ఓటు వేస్తారో ఓటర్లు చెప్పడం లేదని ఓ ప్రధాన పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు అభిప్రాయపడ్డారు.

ఎవరు అడిగితే వారికే మద్దతంటూ..

ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచి అధికార కాంగ్రెస్ ప్రతిపక్ష బీజేపీ, బీజేపీ అభ్యర్థులతో పాటూ చిన్న పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు కూడా ప్రచారం నిర్వహిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికలు కావటంతో .. కొన్ని చోట్ల పార్టీలు ఇంటింటి ప్రచారాన్ని ఇంకా నిర్వహిస్తున్నాయి. అయితే ఓటరు దగ్గరికి ఏ పార్టీ వారు వెళ్లి ఓటును అడిగినా వారికే మా ఓటు అని చెబుతున్నా నమ్మకం కలగడం లేదని ప్రధాన పార్టీల నాయకులు పేర్కొంటున్నారు. 'నేను గత నాలుగు సార్వత్రిక ఎన్నికలు చూశా... ప్రచారానికి ప్రజల్లోకి వెళితే మాకు పరిస్థితి కొంత అర్థం అయ్యేది. ఇప్పుడు ఎంత ఖర్చు చేసినా ఈ ఓట్లు మాకే పడుతాయనే నమ్మకం కుదరడం లేదంటున్నారు. డబ్బులిస్తే తీసుకుంటున్నారు... తప్పితే మీకే మా మద్దతు అని స్పష్టంగా చెప్పడం లేదని ఓ ప్రధాన పార్టీ నుంచి వరుసగా మూడోసారి ఎన్నికల ప్రచారంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న నాయకుడొకరు వెల్లడించారు. ఎదుటి పార్టీలో ఉన్న మిత్రులనూ సంప్రదిస్తే వారు ఇదే అభిప్రాయాన్ని వెల్లడిస్తున్నారని పేర్కొనటం కొసమెరుపు.

అన్ని వర్గాలతో మంతనాలు


క్షేత్రస్థాయిలో రోడ్‌షోలు, ఎన్నికల సభలు, సామాజిక వర్గాల సమ్మేళనాలు, ఎన్నికల ప్రచారం ముగింపు దశకు చేరిన నేపథ్యంలో గ్రేటర్‌తోసహా శివారు మల్కాజిగిరి, సికింద్రాబాద్, చెవేళ్ల పార్లమెంట్ నియోజకవర్గాల్లో అన్ని పార్టీల నాయకులు గంపగుత్త కొనుగోళ్లకే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఓటరు నాడిని పట్టుకునేందుకు ఓ వైపు ముమ్మర ప్రయత్నం చేస్తూనే.. మహిళా సంఘాలు, సామాజికవర్గాలు, అపార్టుమెంట్లు,కాలనీలు,అసోసియేషన్లు, కార్మిక ,ఉద్యోగ సంఘాలు తదితర వాటితో మంతనాలు సాగిస్తున్నారు. దగ్గరి బంధువులు, సోదరులు తొలుత వీరితో మాట్లాడి ఓ 'ధర' నిర్ణయిస్తే చివరకు సదరు ప్రధాన పార్టీ అభ్యర్థి వచ్చి వారితో మాట్లాడి మద్దతివ్వాలని.. గెలిచిన అనంతరం పెద్ద ఎత్తున ఏది కావాలంటే అది చేస్తానని చెప్పి నిర్ణయించిన దాంట్లో 50 శాతం చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే చాలా చోట్ల తొలి విడత మంతనాలు పూర్తి కాగా... చివరి రోజుల్లో వారికి చెల్లింపులు జరగనున్నాయి.

ఉత్సాహంగా హ్యాకథాన్



మేడ్చల్ రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో హ్యాకథాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన కళాశాల కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను తెలికితీసేందుకు హ్యాకథాన్ వంటి కార్యక్రమాల్లో ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. సమాజంలోని సమస్యల పరిష్కారాలు చూపే వేదికగా నిలుస్తుందని, విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొని సమస్యల కు తమ నైపుణ్యంతో పరిష్కారాలు చూపి మంచి గుర్తింపు పొందాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కోశాధికారి త్రిలోక్‌రెడ్డి,డీన్ శ్రీలక్ష్మి, కిరణ్మయి, రాము, కో ఆర్డినేటర్లు శ్రీ జయంతి, దివ్య,అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

వంద శాతం ఓటింగ్‌పై చైతన్య ర్యాలీలు



సాక్షి, మేడ్చల్ జిల్లా: జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ ఆదేశాలతో ఈ 13న (సోమవారం) జరిగే మల్కాజిగిరి పార్లమెంటు ఎన్నికలల్లో వంద శాతం ఓటింగ్‌పై ప్రజల్లో అవగాహన కల్పించే ప్రక్రియలో భాగంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో మహిళా సంఘాలు చైతన్య ర్యాలీలు నిర్వహించారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 61 గ్రామ పంచాయతీల పరిధిలోని వార్డుల్లో 118 గ్రామ మహిళా సమాఖ్యల అధ్వర్యంలో 3,384 స్వయం సహాయక సంఘాల ద్వారా సుమారు పదివేల మంది మహిళలు చైతన్య ర్యాలీలలో పాల్గొన్నట్లు డీఆర్‌డీఏ సాంబశివరావు తెలిపారు. ఓటరు చైతన్య ర్యాలీల్లో మహిళా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారన్నారు.

రైతన్నే.. గెలుపు నిర్ణేత



మల్కాజిగిరి లోక్‌సభ పరిధిలో రైతు కుటుంబాలు 47,506

సాక్షి, మేడ్చల్ జిల్లా: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం అర్బన్,సెమీ అర్బన్ ప్రాంతంగా ఉన్నప్పటికీ ఇక్కడ ఉద్యానవన పంటలు సాగు చేసే రైతు కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బరిలో నిలిచిన ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపు, ఓటమిలపై వీరి ప్రభావం ఉండగలదన్న చర్చ రాజకీయ పార్టీల్లో వ్యక్తమవుతోంది.

పంట సాయం పొందుతున్న రైతులు 47,506

ఆరు నెలలకు ఒకసారి ప్రభుత్వం అందించే పంట సాయం కింద రూ.40 కోట్లు రైతు బంధు తీసుకుంటున్న రైతుల సంఖ్య 47,506 ఉన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల్లో పార్టీల అభ్యర్థుల గెలుపు ఓటమిలపై వీరి ప్రభావం ఉండగలదని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. రైతులపై ఆధారపడి జీవించే వ్యవసాయ కూలీల కుటుంబాలు కూడా ఉన్నాయి. జిల్లాలోని ఘట్‌కేసర్‌లో 6,884 మంది రైతులు ఉండగా, కాప్రాలో 139, కీసరలో 7,667, మేడ్చల్‌లో 11,441, మేడిపల్లిలో 387, మూడుచింతలపల్లిలో7,627, అల్వాల్‌లో 319, బాచుపల్లిలో 113, దుండిగల్ గండిమైసమ్మ మండలంలో 4,018 మంది, కూకట్‌పల్లిలో 20, కుత్బుల్లాపూర్‌లో 230, ఉప్పల్ మండలంలో 242 మంది మొత్తంగా 47,506 మంది రైతులు ఉన్నారు. ఇందులో 28 వేల మంది సన్న ,చిన్నకారు రైతులు ఉండగా, మిగతా రైతులు అంతా ధనిక వర్గాలకు చెందిన వారేనని జిల్లా వ్యవసాయ శాఖ లెక్కలు చెబుతున్నాయి.

ఈటలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలి



బీజేపీలో చేరిన వారితో ఈటల, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, చిత్రంలో రామారావు



ఎదులాబాద్‌లో ప్రచారం చేస్తున్న ప్రవీణ్‌రావు, శ్రీశైలం

ఘట్‌కేసర్: మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఎంపీగా బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌రావు, శ్రీశైలం అన్నారు. బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని ఎదులాబాద్‌లో శుక్రవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇంటింటికి తిరిగి బీజేపీ చేపట్టిన అభివద్ధి పనులు వివరించారు. మాజీ సర్పంచ్ మూసీ శంకరన్న, లక్ష్మణ్, ఆంజనేయులు, భాస్కర్, మలేశ్, రాము, శ్రీరాములు, శ్రీకాంత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక...

ఘట్‌కేసర్: మల్కాజ్‌గిరి గడ్డపై బీజేపీ జెండాకు ఎదురు లేదని మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. ఎంపీపీ సుదర్శన్ రెడ్డి సమక్షంలో బీజేపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌రావు, ప్రధాన కార్యదర్శులు శ్రీశైలం, ప్రభంజన్‌గౌడ్ ఆధ్వర్యంలో వెంకటాపూర్ చౌదరి గూడ ఎంపీటీసీ–1 రామారావుముదిరాజ్‌తో పాటు పలువురు నాయకులు శామీర్‌పేట్‌లోని ఈటల నివాసంలో శుక్రవారం బీజేపీలో చేరారు. ఈటల రాజేందర్ వారికి కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. జంగయ్యముదిరాజ్, ఐలేశ్ముదిరాజ్, లింగం యాదవ్, నరసింహారావు పాల్గొన్నారు.

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ఈస్ట్ గాంధీనగర్‌లో బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచార ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ బీజేపీని గెలిపించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో చైర్మన్ కొకుట్ల చంద్రారెడ్డి, కౌన్సిలర్ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు వెంకటేశ్వరరావు, రాజేష్, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

రుణం చెల్లించని డైరెక్టర్ల సభ్యత్వం రద్దు చేయాలి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘంలో రుణం తీసుకొని తిరిగి చెల్లించని ఆ సంఘం డైరెక్టర్లను సంఘం నియమాలు అనుసరించి వారి సభ్యత్వం రద్దు చేయాలని డైరెక్టర్ బీరెడ్డి స్రవంతి కష్టారెడ్డి శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. డైరెక్టర్లు చందుపట్ల ధర్మారెడ్డి, గ్యార వెంకటేశ్, గోపు బాల్‌రాజ్, వంగూరి లక్ష్మమ్మ సంఘంలో రుణం తీసుకొని తిరిగి చెల్లించకపోవడంతో అనర్హులయ్యారని ఆరోపించారు. అర్హత కోల్పోయిన డైరెక్టర్ల సభ్యత్వం రద్దు చేయాలని లేఖలో కలెక్టర్‌ను కోరారు.

కాంగ్రెస్‌లో చేరిన మున్సిపల్ వైస్‌చైర్మన్

మేడ్చల్ రూరల్: బీఆర్ఎస్ పార్టీకి చెందిన గుండ్లపోచంపల్లి మున్సిపల్ వైస్ చైర్మెన్ ప్రభాకర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కండ్లకోయలోని వైస్ చైర్మెన్ ఇంటికి వెళ్లి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇదిలా ఉండగా ప్రభాకర్ కాంగ్రెస్ పార్టీలో చేరడంతో కండ్లకోయ మాజీ సర్పంచు నరేందర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

మల్కాజిగిరి క్యాంపెయినర్‌గా అరుణ్‌రాజ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ న్యాయ్ పాత్ర క్యాంపెయినర్‌గా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని పోచారం మున్సిపాలిటీకి చెందిన యువజన కాంగ్రెస్ నాయకుడు బి.అరుణ్‌రాజ్‌గౌడ్‌ను నియమించారు. ఈ మేరకు ఇండియన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌బీవీ నియామాకం పత్రాన్ని అరుణ్‌రాజ్‌గౌడ్‌కు అందజేశారు.

ఓటుతో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకుందాం



కుషాయిగూడ: ఓటు అనే ఆయుధంతో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుందామని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర పిలుపునిచ్చారు. ఓటు విలువ తెలుపుతూ శుక్రవారం ఈసీఐఎల్ చౌరస్తాలో విద్యార్థులు, యువకులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటుకు నోటు రాజకీయాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటు కలిగిన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సత్యప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఎన్నికల నిర్వహణ సజావుగా, పారదర్శకంగా జరిగేలా బాధ్యతాయుతంగా పనిచేయాలని మల్కాజిగిరి, మేడ్చల్ ,కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ ,ఎల్బీనగర్,కంటోన్మెంట్ ఏఆర్వోలకు తగిన సలహాలు, సూచనలు చేశారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రతీ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఓటర్ స్లిప్‌లను 100 శాతం పంపిణీ జరిగేలా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. ఏఆర్‌ఓ లు పోలింగ్ కేంద్రాలను సందర్శించి వాటిని పరిశీలించాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు.

నక్రమంగా విధులు చేపట్టాలి

పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా నియమ నిబంధనలను అనుసరించి నోడల్, పోలీస్ అధికారులు తమకు కేటాయించిన విధులను సమన్వయంతో చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ సూచించారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో ముందస్తుగానే పోలింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఎన్నికలు స్వేచ్ఛగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. ఎస్ఎస్‌టీ , ఎఫ్ఎస్‌టీ,వీఎస్‌టీ , అకౌంటింగ్ టీమ్‌లు,ఎంసీఎంసీ , ఎక్సైజ్ అధికారులు సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించాలన్నారు. పోలింగ్‌స్టేషన్ రూట్‌లలో ఎన్నికల నిర్వహణ సామాగ్రిని సంబంధిత సెక్టోరియల్, ప్రీసైడింగ్ అధికారులు ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా మెటీరియల్ పంపిణీ చేయాలన్నారు .ప్రతీ పోలింగ్ కేంద్రంలో సీసీటీవీలు ఏర్పాటు చేయాలన్నారు. బీఎల్‌ఓలు ఓటరు స్లిప్పులను వంద శాతం పంపిణీ చేసేలా చూడాలన్నారు.వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతీ పోలింగ్ కేంద్రంలో అవసరమైన మెడికల్ కిట్స్ అందుబాటులో ఉంచాలన్నారు. చల్లటి తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, 108 అంబులెన్స్ అందుబాటులో ఉంచాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో షామియానాలు, కుర్చీలు, టాయిలెట్స్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.ప్రతి పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపు ,వీల్ చైర్ లు ఏర్పాటు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.100 మీటర్ల దూరం లైన్ మార్క్ ఉండాలన్నారు. పోలింగ్ రోజు ఉదయం ఐదు గంటలకు ఏజెంట్ల సమక్షంలో మాక్ పోల్ నిర్వహించాలన్నారు. సెల్ ఫోన్లు అనుమతించ కూడదన్నారు. లా అండ్ ఆర్డర్ అదుపులో పెట్టే బాధ్యత పోలీస్ యంత్రాంగంపై ఉందన్నారు. రాష్ట్ర సరిహద్దుల్లో ఏర్పాటుచేసిన చెక్ పోస్టులు ఎన్నికలు పూర్తయ్యే వరకు కొనసాగుతాయని తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉండాలన్నారు.

నవ్వులు పూయించిన మల్లారెడ్డి ప్రచారం





నాగారంలో బర్రెలకు మేత తినిపిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి



కీసర: నాగారం మున్సిపాలిటీలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారం జోరుగా నిర్వహించారు. ప్రచారంలో పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి మరోమారు నవ్వుల పువ్వులు పూయించారు. నాగారంలోని బర్రెల కొట్టంలో మల్లన్న మాట్లాడిన సన్నివేశం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బర్రెల పాకలో గేదెలకు మేత తినిపిస్తూ.. 'నేనే మల్లన్నను.. చిన్నప్పుడు మీకు సేవ చేసిన్నే' అంటూ మూగజీవాలతో మాట్లాడారు. మల్లన్న పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఎన్నికల ప్రచారాన్ని వైవిధ్యభరితంగా నిర్వహించారు.

ఘట్‌కేసర్: కారు గుర్తుకు ఓటేసి మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని మున్సిపాలిటీలోని ఎన్ఎఫ్‌సీనగర్ రెండో వార్డులో కౌన్సిలర్ రమాదేవి, మూడో వార్డులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ సుధాకర్ రెడ్డి, సీనియర్ నాయకుడు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ స్టీవెన్, విష్ణువర్ధన్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరిరావు, శివ, సంజీవరెడ్డి, లింగస్వామి పాల్గొన్నారు.

జవహర్‌నగర్: బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కార్పొరేటర్ జిట్టా శ్రీవాణి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం 26వ డివిజన్‌లో ఇంటింటికి ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బయటకు వెళ్లిన వృద్ధురాలి అదృశ్యం



శాంతిదేవి (ఫైల్)

జవహర్‌నగర్: వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన జవహర్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాప్రాల్ జేజేనగర్ అనిత ఎన్‌క్లేవ్‌లో నివసించే శాంతిదేవి (65), కుమారుడు రాహుల్‌కుమార్, కుటుంబసభ్యులతో కలిసి ఉంటున్నారు. ఈ నెల 9న శాంతిదేవి ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఆమె ఆచూకీ కోసం తెలిసిన చోట వెతికినా లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి



ప్రచారం చేస్తున్న సీపీఎం కార్యకర్తలు



అత్వెల్లిలో ప్రచారం చేస్తున్న వజ్రేష్‌యాదవ్



ఘట్‌కేసర్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పోచారం: లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ సీపీఎం కార్యకర్తలు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లకు నమూనా బ్యాలెట్ పేపర్లు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఎస్.సబిత, మండల కమిటీ సభ్యులు జి.నాగమణి, చల్లగొండ అరుణ, కే.అనసూయ, కప్పల శోభ పాల్గొన్నారు.

మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీదే..

మేడ్చల్: మల్కాజ్‌గిరి ఎంపీ స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. మున్సిపాలిటీలో, వివిధ గ్రామాలలో మండల,మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారంటీలతో ప్రజలు ఆనందంగా ఉన్నారని మిగతా గ్యారెంటీలను ప్రభుత్వం త్వరలోనే అమలు చేస్తుందని అన్నారు. ప్రచార కార్యక్రమంలో కౌన్సిలర్‌లు సరిత మల్లేష్‌గౌడ్ దేవ, నాయకులు మండల సంజీవ, రాఘవేందర్‌గౌడ్, కుమార్‌యాదవ్ ,రఫీ, మున్సిపల్ వైస్ చైర్మన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: మల్కాజ్‌గిరి పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సునితామహేందర్‌రెడ్డిని గెలిపించాలని పట్టణంలోని జామామజీద్ వద్ద ఆ పార్టీ అధ్యక్షప్రధాన కార్యదర్శి ముత్యాలుయాదవ్, రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడు నాగరాజ్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన గ్యారంటీలు, హామీలు వివరించారు. జంగయ్యయాదవ్, మల్లేశ్, యాదగిరియాదవ్, సంజీవరెడ్డి, రహమాన్, ఆంజనేయులుయాదవ్, ఫరూక్, అష్రాఫ్ పాల్గొన్నారు.

కీసర: నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీలు, కీసర మండల పరిధిలోని గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం జోరుగా ఎన్నికల ప్రచారం చేశారు. కరపత్రాలు పంపిణీ చేస్తూ హస్తం గుర్తుకే ఓటు వెయ్యాలంటూ ఇంటింటికీ తిరిగారు. విజయ్‌రెడ్డి, పోల కృష్ణయాదవ్, రవీందర్, జంగయ్య యాదవ్, రమేష్ గుప్త, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ రూరల్: కాంగ్రెస్ మల్కాజగిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డిని గెలిపించాలంటూ మండలంలోని మునీరాబాద్, రావల్‌కోల్ తదితర గ్రామాల్లో కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ తోటకూర వజ్రేశ్‌యాదవ్, నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులతో కలిసి సీపీఎం నాయకులు ప్రచారం పాల్గొని కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయాలని స్థానికులను కోరారు.



కీసరలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



గుండ్లపోచంపల్లి వైస్ చైర్మెన్ ప్రభాకర్‌కు కండువా కప్పుతున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మహాత్మా బసవేశ్వర జయంతి వేడుకలు



అల్వాల్: మహాత్మా బసవేశ్వర జయంతి వేడుకలు అల్వాల్ శ్రీనివాసనగర్ కాలనీలో వీరశైవ లింగాయత్, లింగబలిజ సమాజం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సమాజంలో కుల వ్యవస్థ, వర్గ భేదాలను, లింగ వివక్షను సమూలంగా వ్యతిరేకించి అభ్యుద లింగాయత్ ధర్మాన్ని స్థాపించారని కొనియాడారు. సమాజమంతా ఐక్యంగా అల్వాల్‌లో విగ్రహ ప్రతిష్ఠ కోసం పాటుపడాలని సభ్యులను కోరారు. చీఫ్ అడ్వైజర్స్ మృత్యుంజయ, శివప్రసాద్, శోభన్‌బాబు, అధ్యక్షులు భుజంగం, ప్రధాన కార్యదర్శి వీరేశం, ఉపాధ్యక్షులు కరుణాకర్, శ్రీకాంత్, నాగేశ్వర్, కోశాధికారి కుమారస్వామి, మంజుల, శారద, శాంత, చంద్రిక తదితరులు ఉన్నారు.